WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

# నవతరం

తెలుగు దినపత్రిక

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్ , రాజమండ్రి | సంపుటి : 12 | సంచిక : 328 | బుధవారం 8-4-2026 | పేజీలు : 4 | వెల : 5-00

## ఐదు రాష్ట్రాల ఎన్నికల తరవాత ఫోకస్

- ప్రధాని మోదీ ఏం ఆలోచిస్తారో ఎవ్వరికీ తెలియదు
- నితిన్ నబిన్ అధ్యక్షుడిని చేస్తారని ఎవ్వరూ ఊహించలేదు
- మీడియాతో బిజెపి ఎంపి లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్,రాష్ట్రంలో నారద :** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణపై ఫోకస్ చేస్తామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ స్పష్టం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా ఉన్నా.. రేవంత్ వైపు గాలి వీచిందని తెలిపారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ లక్ష్మణ్ విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ప్రధాని మోదీ ఏం ఆలోచిస్తారో రెండో వ్యక్తికి కూడా తెలియదన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితీన్ నబీన్‌ను ఎంపిక చేస్తారని ఎవ్వరూ ఊహించలేదని తెలిపారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ నిలబడడం

మిగతా 2లో



## హోంగార్డుల సమస్యలు పరిష్కరించండి

**తమిళనాడు జాలర్ల దుందుడుకు చర్యలను ఆపండి**

**సిఎం చంద్రబాబుకు బిజెపి అధ్యక్షుడు మాధవ్ లేఖ**

**అమరావతి, రాష్ట్రంలో నారద :** అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ) ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాయబట్టే ఎన్ఎఫ్‌డీబీ ఏర్పాటుకు కేంద్రం ముందుకు వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో

మిగతా 2లో

## కప్పై బిల్లులు చెల్లిస్తేనే ఎత్తిపోతలకు విద్యుత్ సరఫరా



- రూ.33 వేల కోట్లకు పైగా బకాయిలున్నాయి.. నీటి పారుదల శాఖకు ఇంధన శాఖ అల్టిమేటం
- ఎత్తిపోతల పథకాలు ఐరావతంలా మారాయి: ఉప ముఖ్యమంత్రి భట్టి
- ఆచితూచి పంపులు నడపండి ఉత్తమ్ కుమార్ రెడి

2లో



# ఖర్చుగా కాదు... భాగస్వామ్యంగా చూడండి....

- ప్రాధాన్య రంగాలను మీరే ఎంచుకోండి...
- అవసరమైన సహకారం మేం అందిస్తాం...
- సిఎస్ఆర్ నిధులపై పెనీల ప్రతినిధులతో .రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,రాష్ట్రంలో నారద :** సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీలు సీఎస్ఆర్‌కు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుందని తెలియజేశారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకొని సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని సూచించారు. ప్రభుత్వంతో పాటు కంపెనీలు కలిపి చేసే వ్యయంతో తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యం ఉన్న వారిగా తీర్చిదిద్ది భవిష్యత్ అవకాశాలను వారు అందిపుచ్చుకునేలా తయారు చేయగలమని సీఎం అన్నారు. విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్ నగరంలోనే 44 శాతం ఉన్నారని.. వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్ని మౌలిక వసతులను వినియోగించుకుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత

మిగతా 2లో

### చేనేతలో టెండర్ల విధానం రద్దు చేయండి

సిఎం రేవంత్‌తో ఘనా హైకమిషనర్ భేటీ

సిఎంతో భేటీ అయిన టాటా ఏరో స్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్



## టిడిపి సమావేశాల నిర్వహణలో నిర్లక్ష్యం

- పార్టీ నేతల తీరుపై లోకేశ్ అసహనం
- పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు సన్మానం
- మంగళగిరి టిడిపి కార్యాలయంలో లోకేశ్



**అమరావతి,రాష్ట్రంలో నారద :** కొందరు పార్టీ నేతల తీరుపై మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్ర అసమనం వ్యక్తం చేశారు. ఇలా అయితే ఎలా అంటూ ఆగ్రహం కూడా వ్యక్తపరచారు. కేడర్ సమావేశాలు, గ్రీవెన్స్ వరుసగా నాలుగు వారాలు నిర్వహించని పలువురు నాయకులను నారా లోకేశ్ మందలిం చారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి వరుసగా నాలుగు వారాలు కేడర్ సమావేశాలు, గ్రీవెన్స్ నిర్వహించకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాలు

మిగతా 2లో

## కోర్టు తీర్పు వచ్చే వరకు ఆగలేరా

- అప్పుడే వెళ్లి రైతులను వేధించాలా
- హైడ్రా తీరుపై మండిపడ్డ మందకృష్ణ మాదిగ



**సంగారెడ్డి,రాష్ట్రంలో నారద :** :ఐలాపూర్‌లోని సర్వే నంబర్ -1 నుంచి 220 వరకు గల 1265 ఎకరాల భూమి భూ వివాదంలో పేద రైతులను హైడ్రా ఇబ్బంది పెట్టడం సరికాదని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివాదాస్పద భూములతో సంబంధం లేని రైతులను భయభ్రాంతులకు గురిచేయటం దారుణమని మంద కృష్ణ మాదిగ చెప్పారు. కోర్టు పరిధిలో ఉన్న కేసుల్లో తీర్పు వచ్చేంతవరకు హైడ్రా అధికారులు సంయమనం పాటించాలని సూచించారు. ఈ మేరకు హైడ్రాపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ షాకింగ్ కామెంట్స్ చేశారు. బుధవారం అమీన్ పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలోని

మిగతా 2లో

# ఖర్చుగా కాదు... భాగస్వామ్యంగా చూడండి

(మొదటి పేజీ (తరువాయి)





అభివృద్ధికి కేటాయించాలన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటి వరకు సరైన విధానం లేనందున తాము ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఇందుకు నియమించామని సీఎం తెలిపారు. కంపెనీల ప్రతినిధులు ఆయనతో సమన్వయం చేసుకొని తమకు ఆసక్తి ఉన్న విద్యా, వైద్యం, జల వనరులు, నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణ ఇలా దేనికైనా సీఎస్ఆర్ నిధులు వినియోగించవచ్చని సీఎం తెలిపారు. ఇప్పటికే రహేజా గ్రూప్ రూ.50 కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50 కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10 కోట్లు విద్యాభివృద్ధికి కేటాయించేందుకు ముందుకు వచ్చాయని.. వారికి సీఎం అభినందనలు తెలిపారు. కంపెనీల ప్రతినిధులు స్పందిస్తూ సీఎస్ఆర్ నిధుల విషయంలో ఇప్పటి వరకు ఇలా ఎవరూ తమను సంప్రదించలేదని తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యా, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు వారు ఆసక్తి చూపారు.. సమావేశంలో రహేజా ఫౌండేషన్ నుంచి శ్రావణ్ కుమార్, రాంకీ ఫౌండేషన్ నుంచి దాక్షయణి ఆళ్ల, యశోద ఆసుపత్రి నుంచి డాక్టర్ గోరుకంటి సురేందర్ రావు, గోరుకంటి ఫల్గుణ్ రావు, మేఘా నుంచి సుధా రెడ్డి, అపోలో ఆసుపత్రి నుంచి అపర్ణా రెడ్డి, కామినేని భాస్కర్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి శేఖర్ రెడ్డి, పగిడిపాటి దేవయ్య, రుద్రమదేవి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు

## ఐదు రాష్ట్రాల ఎన్నికల తరవాత ఫోకస్

అంతా ఈజీ కాదని చెప్పారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అడిగే ప్రశ్నలకు ఎవ్వరూ సమాధానం చెప్పడం లేదన్నారు. అయితే కవిత ప్రస్తుతం ప్రస్తావిస్తున్న అంశాలు.. ఆమె బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడే మాట్లాడి ఉంటే బాగుండేదని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని ఎవరూ ఊహించలేదన్నారు. తెలంగాణ ప్రజలు తెలివైన వారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 8 సీట్లు వచ్చినా.. 38 శాతం ఓట్లు ప్రజలు ఇచ్చారని ఎంపీ లక్ష్మణ్ వివరించారు. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీదే పైచేయి అవుతుందని ఈ సందర్భంగా ఆయన జోస్యం చెప్పారు. ఒక ఎన్నిక తీసుకుని ఎప్పుడూ అంచనా వేయడం తప్పు అని అభిప్రాయపడ్డారు. మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లు తరువాత.. మొత్తం వన్ సైడేనని అన్నారు. ఇప్పటికే మహిళా బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయనే విషయం ప్రజల్లోకి వెళ్లిందని తెలిపారు.

బట్ట కాల్చి మీద వేస్తే.. ప్రజలు అంత అమాయకులు కాదన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చునని చెప్పారు. తమిళనాడులో టీవీకే పార్టీ అధినేత విజయ్ సమావేశాలకు ప్రజలు భారీగా వస్తున్నారని.. కానీ ఆ పార్టీ జస్ట్ 5 లేదా 6 సీట్ల కంటే ఎక్కువ గెలవదన్నారు.

తెలంగాణలో హెట్ స్పీచ్ బిల్లు తెచ్చి పకడ్బందీగా అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి గతంలో ప్రకటించారని ఎంపీ లక్ష్మణ్ గుర్తు చేశారు. ముస్లింలను రెచ్చగొట్టే వ్యాఖ్యలపై సీఎం రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది హేట్ స్పీచ్ కాదా? అని సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు.

## క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

విజయవాడ,ఏప్రిల్8: ఆంధ్రప్రదేశ్‌లో క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రవాణా, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. క్రీడల వికాసానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోపాటు యువనేత, మంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. లోకేశ్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ క్రీడాంధ్ర ప్రదేశ్ కావడం తథ్యమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియాన్ని వందల కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ స్టేడియం అభివృద్ధి కోసం ఖేలో ఇండియా ద్వారా రూ.20 కోట్లు, శాప్ ద్వారా మరో రూ.20 కోట్లు.. అలాగే మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.160 కోట్లను మూడు దశల్లో ఖర్చు చేయనుందని మంత్రి మండిపల్లి తెలిపారు. విజయవాడకు తలమానికంగా నిలిచిన ఈ స్టేడియం గత ప్రభుత్వ పాలనలో ఐదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైందని మంత్రి మండిపడ్డారు. ప్రస్తుతం ఎంపీ కేశినేని శివనాథ్ నాయకత్వం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, శాప్ సమన్వయంతో దీని అభివృద్ధికి జీవో తీసుకురావడం జరిగిందని చెప్పారు

## కపై బిల్లులు చెల్లిస్తేనే ఎత్తిపోతలకు విద్యుత్ సరఫరా

హైదరాబాద్, ఏప్రిల్ 8 : రూ.33వేల కోట్ల మేర బిల్లులు బకాయి పడ్డారు. ఇకపై బిల్లులు చెల్లిస్తేనే ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ సరఫరా చేస్తాం. లేదంటే ఇవ్వలేం.. అంటూ నీటి పారుదల శాఖకు ఇంధన శాఖ తేల్చిచెప్పింది. ఎత్తిపోతల పథకాల పంపులను ఏ సమయంలో ఆపరేట్ చేయాలి?, బకాయిల చెల్లింపుల అంశంపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో బుధవారం కీలక సమావేశం జరిగింది. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆర్థిక, ఇంధన, నీటపారుదల శాఖ ఉన్నతాధికారులు, ట్రాన్స్‌కో , డిస్కమ్‌ల సీఎండీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ మాట్లాడుతూ.. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల దాకే ఎత్తిపోతల పథకాల పంపులు నడిపించాలని, ఆ సమయంలో సౌర విద్యుత్ ఉత్పత్తి అధికంగా ఉంటుందని, తక్కువ ధరకు విద్యుత్ లభిస్తుందని సూచన చేశారు. దీనివల్ల విద్యుత్ సంస్థలపైనా భారం పడదన్నారు. విద్యుత్ సంస్థలు రూ.50 వేల కోట్లకు పైగా అప్పుల్లో ఉన్నాయని, ఇందులో రూ.33,653కోట్లు నీటిపారుదల శాఖ నుంచే రావాలన్నారు. బిల్లులు కట్టకుండా 24 గంటల పాటు విద్యుత్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అధిక ధరకు లభించే కరెంట్‌తో కాకుండా తక్కువ ధరకు లభించే సౌరవిద్యుత్‌తో పంపింగ్ చేసుకోవాలని నవీన్ మిట్టల్ సూచించారు.

## హోంగార్డుల సమస్యలు పరిష్కరించండి

అమరావతి,ఏప్రిల్8 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం హోం గార్డులు.. విధి నిర్వహణలో భాగంగా పోస్టింగ్ కారణంగా తమ సొంత ఊళ్లకు దూరంగా ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో చాలా మంది ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో సేవలందిస్తుండగా.. వారి కుటుంబాలు తెలంగాణలో నివసిస్తున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుమారు 200 మంది హోంగార్డులు ప్రస్తుతం ఏపీలో పని చేస్తున్నారని వివరించారు. అందువల్ల వారు తీవ్ర వ్యక్తిగత, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీనితోపాటు నైతిక స్థైర్యాన్ని సైతం వారు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారికి న్యాయం చేయాలని సిఎంను కోరారు. ఆంధ్రప్రదేశ్ సముద్ర తీర ప్రాంతంలోకి తమిళనాడుకు చెందిన జాలర్లు బోట్లు ద్వారా చొచ్చుకొచ్చి స్థానికులను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఈ రెండు సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ లేఖ ద్వారా తీసుకెళ్లారు. ఈ లేఖను ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ బుధవారం అమరావతిలో విడుదల చేశారు. పరస్పర ప్రాతిపదికన రాష్ట్రాల మధ్య బదిలీకి వీలు కల్పించడం ద్వారా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న హోం గార్డుల సమస్యలను పరిష్కరించడంలో సహాయపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

దే విధంగా పొరుగున ఉన్న తమిళనాడులోని కడలూరు, కారేకల్‌కు చెందిన జాలర్లు ఆంధప్రదేశ్‌లోని నెల్లూరు, ఒంగోలు, బాపట్ల ప్రాంతాలకు వచ్చి స్థానిక మత్స్యకారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ లేఖలో సీఎం చంద్రబాబుకు మాధవ్ వివరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఇప్పటికే పలు సంఘటనలు అక్కడ జరిగాయని తెలిపారు. తమిళనాడుకు చెందిన మత్స్యకారులు స్పీడు బోట్లతో ఆంధ్ర తీర ప్రాంతంలో మత్స్య సంపదను దోచుకుంటున్నారని విమర్శించారు. ఏడాది మార్చిలో నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ప్రాంతంలో అక్రమంగా సంచరిస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్న తమిళనాడు జాలర్ల బోట్లను అక్కడ స్థానికులు నిర్బంధించారని పీవీఎన్ మాధవ్ గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు స్థానిక అధికారుల తోడ్పాటుతో ఆ బోట్లను రాత్రికి రాత్రే విడుదల చేశారని చెప్పారు. తమిళనాడుకు చెందిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. అక్రమంగా ఆంధ్ర తీర ప్రాంతంలో సంచరిస్తూ స్థానికులను భయ భ్రాంతులకు గురి చేస్తున్న తమిళనాడు జాలర్లలపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు పీవీఎన్ మాధవ్ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

## పాక్‌లో తీవ్ర ఇంధన కొరత

### లాక్‌డౌన్ తరహా ఆంక్షలు విధింపు



ఇస్లామాబాద్,ఏప్రిల్ హోర్ముజ్ జలసంధి మీదుగా ముడి చమురు, సహజవాయువు రవా ణా నౌకల రాకపోకలపై ఇరాన్ ఆంక్షలు విధించిన నేపథ్యం లో ప్రపంచాన్ని ఇంధన సంక్షోభం భయపెడుతోంది. ఇంధన కొరతఓ ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌లో ప్రభుత్వం తాజాగా లాక్‌డౌన్ తరహా ఆంక్షలకు తెరతీసింది. వాణిజ్య కార్యకలాపాలపై పరిమితులను ప్రకటించింది. విద్యుత్, ఇంధన పొదుపు చర్యలపై సమావేశం నిర్వహించిన అనంతరం పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ ఆంక్షలను ప్రకటించారు. రేడియో పాకిస్థాన్ ప్రసారం చేసిన వివరాల ప్రకారం, ఇకపై దేశవ్యాప్తంగా పాక్‌లో మార్కెట్స్, షాపింగ్ మాల్స్, ఇతర వాణిజ్య సముదాయాలను రాత్రి 8 గంటల కల్లా మూసివేయాల్సి ఉంటుంది. అయితే, డివిజనల్ హెడ్‌క్వార్టర్స్‌కు మాత్రం ప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పించింది. ఆయా ప్రాంతాల్లో రాత్రి 9 గంటల వరకూ కార్యకలాపాలు కొనసాగించేందుకు అనుమతించింది. ఇక బేకరీలు, ఫుడ్ స్టాల్స్ వంటివి కూడా రాత్రి 10 గంటల కల్లా మూసేయాల్సి ఉంటుంది.అయితే, ఫార్మసీలు, ఇతర హెల్త్ కేర్ సర్వీసెస్‌కు సంబంధించిన షాపులకు మాత్రం ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు.

## టిడిపి సమావేశాల నిర్వహణలో నిర్లక్ష్యం



నిర్వహించకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకోవాలని పార్టీ కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నారా లోకేశ్ బుధవారం టీడీపీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆ పార్టీ నేతలపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు వారాల నుంచి కేడర్ సమావేశాలు నిర్వహించని పులివెందుల ఇన్‌చార్జ్ బీటెక్ రవి, కమలాపురం ఎమ్మెల్యే చైతన్య రెడ్డి, నాలుగు వారాల నుంచి గ్రీవెన్స్ నిర్వహించని ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పట్ల నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు కచ్చితంగా నిర్వహించాలని లోకేశ్ హుకుం జారీ చేశారు. ఇకముందు ఇలానే వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని లోకేశ్ స్పష్టం చేశారు. కష్టపడిన వారిని గుర్తించాలనేది తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. నేతల పనితీరే ఇక్కడి వరకు రావడానికి కారణమని చెప్పారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే పార్టీ వందేళ్లు ఉంటుందని తెలిపారు. 'మై టీడీపీ యాప్' టాప్ 10 ఫెర్ఫార్మర్స్‌తో మంత్రి లోకేశ్ ఆత్మీయ భేటీ అయ్యారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశర చేశారు. యాప్ సమర్థ వినియోగం పట్ల ఉత్తమ కార్యకర్తలను లోకేశ్ ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించడమే తమ సిద్ధాంతమని లోకేశ్ అన్నారు. పార్టీకి అండగా నిలిచిన వారిని ఎప్పటికీ విస్మరించేది లేదన్నారు. 'మై టీడీపీ యాప్' టాప్-10 ఫెర్మార్మర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'మై టీడీపీ యాప్' సమర్థ వినియోగం, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడంపై మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. మీ పని తీరే ఇక్కడి వరకు రావడానికి కారణమంటూ కొనియాడారు. ఉత్తమ కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం మరింతగా కష్టపడాలని, టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి లోకేశ్ భరోసా కల్పించారు.

## కోర్టు తీర్పు వచ్చే వరకు ఆగలేరా



వివాదంలో ఉన్న భూముల రైతులను మంద కృష్ణ మాదిగ, హైకోర్టు అడ్వకేట్ ముఖీం పరామర్శించారు ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడారు. కోర్టు పరిధిలో లేని భూములకు సంబంధించిన రైతుల జోలికి హైడ్రా, రెవెన్యూ అధికారులు రావొద్దని కోరారు. రైతులకు ఉన్న లీగల్ హక్కులకు భంగం వాటిల్లితే సహించబోమని హెచ్చరించారు. ఏదైనా కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా దృష్టి పెడితే ఏ సమస్య ఉండదని తెలిపారు. హైడ్రా తన పరిధిలో పనిచేస్తుందా, అతిక్రమిస్తుందా అనే ఆంశంపై ఒకసారి ముఖ్యమంత్రి పరిశీలించాలని అన్నారు. హైడ్రా పరిధిలో ఉన్న భూ వివాదాలు పరిష్కారానికి ప్రత్యేక కోర్టు అవసరం ఉందని చెప్పుకొచ్చారు. హైడ్రా అనవసర జోక్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు.

## చేనేతలో టెండర్ల విధానం రద్దు చేయండి



హైదరాబాద్,ఏప్రిల్8 ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘనా హైకమిషనర్ క్వాసి ఒబిరి-డాన్సో మర్యాదపూర్వకంగా కలిసిన రిపబ్లిక్ ఆఫ్ ఘనా హైకమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా హైదరాబాద్ కు వచ్చిన క్వాసి ఒబిరి-డాన్ సిఎంను ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఘనా, తెలంగాణ మధ్య సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించిన హైకమిషనర్. విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలు, ఆరోగ్య, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారం ఉండాలని కోరిన హైకమిషనర్. స్పందించిన సీఎం రేవంత ఆయనకు శాలువాతో సన్మానించారు.

అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టాటా ఏరో స్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్ కలిశారు. భారతదేశంలో ఎఫ్-130ఏ సూపర్ హెర్క్యులస్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను ఏర్పాటు చేయనున్న లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ. అంతర్జాతీయ అవసరాల కోసం భారతదేశంలోని టిఎఎస్ఎల్ లో

ఈ-16 వింగ్స్ ను ఉత్పత్తి చేసేందుకు లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది. తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నట్లు ఈ సందర్భంగా టిమ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

నవతరం
నేటితరం కోసం...
గురువారం 9
ఏప్రిల్ 2026

# అధికారుల కళ్లుగప్పి కడుతున్నారా?
# లేక కాసులు కళ్లజూపి కడుతున్నారా?

- **పంచాయతీ కార్యాలయానికే 'ఎదురు' నిలుస్తున్న అక్రమ కట్టడం**
- **ఊట్లపల్లిలో నిబంధనలు తుంగలో.. సెక్రటరీ మౌనం వెనుక మర్మమేమిటి?**
- **పంచాయతీరాజ్ చట్టానికి తూట్లు**
- **నాలుగు షట్టర్లు, మూడు అంతస్తులు, సున్నా అనుమతులు**
- **అక్రమ ఇసుక రవాణాకు అడ్డాగా మారిన ఊట్లపల్లి**
- **నోటీసులు ఇవ్వమంటే కాలయాపన ఎందుకు? అధికారులు తీరుపై స్థానికుల ఆగ్రహం**

(నవతరం ప్రతినిధి): ఖమ్మం భద్రాద్రి జిల్లా చట్టం తన పని తాను చేసుకుపోతుంది.. కానీ అశ్వారావుపేట మండలం ఊట్లపల్లిలో మాత్రం చట్టం 'నిద్రపోతోంది'. అది కూడా ఎక్కడో కాదు, సాక్షాత్తూ అధికార యంత్రాంగం నిత్యం కొలువుదీరే పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలో. చట్టం చుట్టం అయిందా? అధికారులు రాకపోకలు సాగించే దారిలోనే ఇంత భారీ నిర్మాణం జరుగుతుంటే అది అధికారుల దృష్టికి రాలేదంటే నమశక్యంగా లేదు.ఇది అధికారుల అసమర్థతా లేక అక్రమార్కులతో కుమ్మక్కయ్యారా? అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేవు.. నిబంధనల ఊసే లేదు.. కానీ ఆకాశమే హద్దుగా జీం3 అంతస్తుల భారీ భవనం శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. నాలుగు భారీ షట్టర్లతో వెలుస్తున్న ఈ అక్రమ కట్టడం వెనుక అధికారుల 'కృపాకటాక్షాలు' పుష్కలంగా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### కళ్లున్నా చూడలేని స్థితిలో యంత్రాంగం!

గత 9 నెలలుగా ఈ భారీ నిర్మాణం జరుగుతుంటే, పంచాయతీ సెక్రటరీ రజిని మాత్రం తనకేమీ తెలియనట్లు వ్యవహరించడం విస్మయానికి గురిచేస్తోంది. "అనుమతులు లేవు" అని ఒక పక్క చెబుతూనే, కళ్లముందే లేస్తున్న స్లాబులను ఆపలేకపోవడం వెనుక ఆంతర్యమేమిటి? రెండవ అంతస్తు పూర్తి కావస్తున్న సమయంలో ప్రశ్నిస్తే, "ఆఫీసుకి రండి.. మాట్లాడదాం" అని బదులివ్వడం చూస్తుంటే, లోపల ఏదో పెద్ద తతంగమే నడుస్తోందని స్థానికులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

ప్రకృతి వదనరుల లూటీ.. అంతా ఇల్లీగల్! తెలంగాణలో ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ అందుబాటులో లేని ప్రస్తుత పరిస్థితుల్లో, ఈ భారీ నిర్మాణానికి అవసరమైన వందల ట్రక్కుల ఇసుక, మట్టి ఎక్కడి నుంచి వచ్చాయి? అర్ధరాత్రి వేళల్లో అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లే ఈ భవనానికి ప్రాణవాయువు పోస్తున్నాయి. అక్రమ ఇసుకతో అక్రమ నిర్మాణం చేస్తున్నా, అటు రెవెన్యూ యంత్రాంగం గానీ, ఇటు పంచాయతీ అధికారులు గానీ చూసీచూడనట్లు ఉండటం చూస్తుంటే అధికారుల 'అలసత్వం' చంప చెల్లుమనేలా ఉంది. నియమ నిబంధనల ప్రకారం ఇసుక కొనుగోలుకు రసీదులు ఉండాలి. కానీ తెలంగాణలో ఆన్లైన్ ప్రక్రియ అందుబాటులో లేని సమయంలో ఈ బిల్డింగ్ నిర్మాణానికి వాడిన ఇసుక అంతా అక్రమ మార్గాల్లో తరలించిందేనని అని స్పష్టమవుతుంది.

### నోటీసుల నాటకం.. అధికారుల పొంతన లేని సమాధానాలు

ఈ వ్యవహారంపై మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో), ఎంపీఓ (ఎంపీ ఓ)లను సంప్రదించగా, వారు "నోటీసులు జారీ చేయమని చెప్పాం" అని దాటవేస్తున్నారు. ఉన్నతాధికారులు ఆదేశించినా, క్షేత్రస్థాయిలో సెక్రటరీ గారు ఎందుకు వెనకాడుతున్నారు? పైగా స్థానిక ప్రజాప్రతినిధులు "బ్లూ ప్రింట్ ఇస్తే ఫైన్ కట్టి క్రమబద్ధీకరించవచ్చు" అని సలహాలు ఇవ్వడం విడ్డూరం. తప్పు చేసిన తర్వాత జరిమానా కట్టి సర్దుబాటు చేసుకోవచ్చనే ధీమాతోనే అక్రమార్కులు రెచ్చిపోతున్నారా? లేట్ ఫైన్ తో క్రమబద్ధీకరణ అని చెప్పడం అక్రమార్కులకు కొమ్ము కాయడమే అవుతుంది. ఇది భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో అక్రమ నిర్మాణాలకు బాటలు వేసే ప్రమాదం ఉంది.

### నియమ నిబంధనలు ఏం చెబుతున్నాయి?

తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం: ఏదైనా నిర్మాణం చేపట్టే ముందు గ్రామ పంచాయతీ నుండి ముందస్తు అనుమతి తప్పనిసరి. భారీ కట్టడాలకు (జీం2 పైన) జిల్లా స్థాయి అధికారుల అనుమతి ఉండాలి.

నోటీసుల జారీ: అనుమతి లేని కట్టడాన్ని గుర్తించిన వెంటనే 'స్టాప్ వర్క్' నోటీసులు ఇవ్వాలి. వినకపోతే సీజ్ చేసే అధికారం పంచాయతీకి ఉంది.

మైదాన ప్రాంత రక్షణ: పర్యావరణపరంగా సున్నితమైన మైదాన ప్రాంతాల్లో ఇలాంటి భారీ కాంక్రీట్ కట్టడాలు నిబంధనలకు విరుద్ధం.

### జనం అడుగుతున్న ప్రశ్నలివే

ఆఫీసు ఎదురుగా అక్రమ కట్టడం జరుగుతుంటే సెక్రటరీ కి ఉన్న 'అడ్డంకి' ఏమిటి?

ఉన్నతాధికారులు నోటీసులు ఇవ్వమన్నా ఎందుకు జాప్యం చేస్తున్నారు?అక్రమ ఇసుక రవాణాపై మైనింగ్ మరియు పోలీస్ శాఖలు ఎందుకు మౌనంగా ఉన్నాయి?

మైదాన ప్రాంతాలైన ఊట్లపల్లి వంటి గ్రామాల్లో ఎవరికి నచ్చినట్లు వారు అనుమతులు లేకుండా భవంతులు కట్టుకుంటూ పోతే, రేపు సామాన్యుడి పరిస్థితి ఏమిటి? అనుమతులు లేకపోవడం వల్ల అనుమతుల ప్రక్రియలో భాగంగా స్ట్రక్చరల్ ఇంజనీర్ ప్లాన్ అధికారులు పరిశీలిస్తారు. అనుమతి తీసుకోకుండా కట్టేటప్పుడు కూలిపోయే ప్రమాదం నేల స్వభావాన్ని బట్టి పునాదులు వేయకపోవడం వల్ల భవనం ఒక పక్కకు ఒరగడం లేదా ఒక్కసారిగా కూలిపోవడం జరుగుతుంది. పర్యవేక్షణ లేకపోవడంతో సిమెంటు ఇనుము వంటి వస్తువుల నాణ్యత తగ్గి భవనం బలహీనపడుతుంది. భవన నిర్మాణానికి ఫైర్ ఎన్ఓసి తప్పనిసరి అనుమతులు లేని భవనాల్లో ఎగ్జిట్ పాయింట్లు ఉండవు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు బయటకు రావడానికి సరైన దారులు, మెట్లు ఉండవు. భవనం చుట్టూ వదలాల్సిన ఖాళీ స్థలం లేకపోవడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు ఫైర్ ఇంజన్ లోపలికి రాలేదు. అనుమతులు లేకుండా కట్టడం వల్ల మీరు పెట్టే పెట్టుబడి మొత్తం ప్రమాదంలో పడుతుంది.కాబట్టి ఎల్లప్పుడూ నిబంధనల ప్రకారం అనుమతులు పొందిన తర్వాతే నిర్మాణం ప్రారంభించడం ఉత్తమం. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి ఈ భారీ అక్రమ కట్టడాన్ని అడ్డుకోవాలని, విధి నిర్వహణలో విఫలమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


















# అటవీ శాఖ 'గ్రీన్ క్రెడిట్' పనుల్లో నాణ్యత లోపం?

- **నిర్మాణమైన ఆరు నెలలకే వంగిపోయిన ముఖద్వారం**
- **భారీ వాహనాల రాకపోకలకు ఆటంకం**
- **అశ్వారావుపేట రేంజ్ పరిధిలో పరిస్థితి**

నవతరం ప్రతినిధి: ఖమ్మం భద్రాద్రి జిల్లా పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్' (జి సి పి) అమలులో క్షేత్రస్థాయిలో అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ డివిజన్, అశ్వారావుపేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ఊట్లపల్లి బీట్, వేదాంతపురం ప్లాంటేషన్ వద్ద నిర్మించిన రక్షణ గేట్లు మరియు ఆర్చ్‌లు నిర్మాణ లోపాలతో వెక్కిరిస్తున్నాయి.

### నిర్మాణ లోపమా? పర్యవేక్షణ లోపమా?

వేదాంతపురం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో కొత్తగా చేపట్టిన ప్లాంటేషన్ రక్షణ కోసం నిర్మించిన ముఖద్వారం (ఆర్చ్) ఆరు నెలలు కూడా గడవకముందే దెబ్బతినడం విచారకరం. అడవిలోకి ప్లాంటేషన్ పనుల నిమిత్తం వెళ్లే జెసిబిలు, లారీలు వంటి భారీ వాహనాల ఎత్తును అంచనా వేయకుండానే ఈ ఆర్చ్‌ను తక్కువ ఎత్తులో నిర్మించినట్లు తెలుస్తోంది. దీనివల్ల వాహనాలు వెళ్లే క్రమంలో ఆర్చ్ పైభాగం తగిలి వంగిపోయింది.

రాయి అడ్డం పెట్టి 'మమ' అనిపించారు.


వంగిపోయిన ఆర్చ్ ఎప్పుడైనా విరిగి పడే ప్రమాదం ఉన్నప్పటికీ, అధికారులు తాత్కాలికంగా ఒక ఇటుక రాయిని అడ్డం పెట్టి దానిని నిలిపే ప్రయత్నం చేయడం గమనార్హం. ఇది అటవీ శాఖా అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని స్థానికులు విమర్శిస్తున్నారు. భారీ వాహనాలు వెళ్లే మార్గంలో కనీసం 15 అడుగుల ఎత్తు ఉండాల్సిన ఆర్చ్‌ను అంతకంటే తక్కువ ఎత్తులో నిర్మించడం వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటని ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### కేంద్ర నిధులు వృధా?

కేంద్ర ప్రభుత్వం గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్ కింద అడవుల పెంపకానికి భారీగా నిధులు కేటాయిస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో పనుల నాణ్యతను పర్యవేక్షించాల్సిన రేంజ్ అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించే ఇలాంటి కట్టడాలు కనీసం ఏడాది కూడా నిలవకపోవడంపై ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

వెంటనే పాల్వంచ డివిజనల్ అటవీ అధికారి (డీఎఫ్వో) స్పందించి, అశ్వారావుపేట రేంజ్ పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై విచారణ జరిపించాలని, ప్రమాదకరంగా ఉన్న ఆ ఆర్చ్‌ను తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.






# దురంధర్-2 విజయంపై స్పందించని దీపిక



విమర్శకులకు ఘాటు సమాధానం ఇచ్చి నటి బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తోంది. అయితే, ఈ సినిమా విజయంపై రణ్‌వీర్ భార్య, నటి దీపికా పదుకొణె ఇప్పటివరకూ స్పందించకపోవడంపై విమర్శలు ఎదురయ్యాయి. తాజాగా ఈ ట్రోల్స్‌పై ఆమె తనశైలిలో సమాధానమిచ్చారు. ఒక ఇన్‌స్టా పేజ్‌లో 'దీపికా తన భర్త సినిమాను ఎందుకు చూడడం లేదు. దాని గురించి ఎందుకు మాట్లాడట్లేదు' అని పెట్టిన పోస్ట్‌పై ఆమె స్పందిస్తూ.. 'మీ అందరికంటే ముందే నేను ఆ సినిమాను చూశాను. ఈ విషయం మీకు తెలీదు. ఇప్పుడు చెప్పండి ఎవరు ఎవరిని విమర్శించాలి' అంటూ వ్యంగ్యంగా కౌంటర్ ఇచ్చారు.

సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టనంత మాత్రాన తన భర్తకు మద్దతు ఇవ్వడం లేదని అనుకోవడం సరికాదని ఆమె ఈ రిప్లైతో స్పష్టంచేశారు. ఆదిత్యధర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం భారతీయ సినిమా చరిత్రలో రూ.1000 కోట్ల మార్క్‌ను దాటిన తొలి బాలీవుడ్ చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది.

రణ్‌వీర్‌తో పాటు ఆర్.మాధవన్,

అక్షయ్‌ఖన్నా వంటి స్టార్స్ నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది.

# లవ్ ఇన్సూరెన్స్ ప్రీ రిలీజ్ ఈవెంట్








విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి జంటగా నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా రూపొందింది. ఈ చిత్రాన్ని నయనతార తన బ్యానర్‌పై నిర్మించడం విశేషం. ఇటీవల ఈ సినిమా తమిళ ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్‌లో దర్శకుడు విఘ్నేష్ శివన్ మాట్లాడుతుండగా, అనూహ్యంగా నయనతార స్టేజిపైకి వచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె సడన్ ఎంట్రీతో అక్కడి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. తన భార్యను స్టేజిపై చూసిన విఘ్నేష్ భావోద్వేగానికి గురయ్యాడు. కళ్లలో నీళ్లు తెచ్చుకున్న ఆయనను నయనతార దగ్గరికి వెళ్లి కౌగలించుకొని ఓదార్చింది. ఈ సన్నివేశం అక్కడున్నవారినే కాదు, అందరిని కూడా కదిలించింది. నయనతార తన భర్తకు ఇచ్చిన భావోద్వేగ మద్దతు చూసి ఫ్యాన్స్ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. 'రియల్ లైఫ్‌లో నిజమైన భాగస్వామ్యం ఇదే' అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, కృతి శెట్టి జంటగా రూపొందిన చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఏప్రిల్ 10న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కాబోతోంది. ప్రమోషన్స్ లో భాగంగా ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న విఘ్నేష్.. ధనుష్ గురించి మాట్లాడుతూ..'ధనుష్ సార్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన్ని ఎప్పుడూ గొప్పగానే చూస్తాను. జులై 28 ఆయన బర్త్ డే. అది మా మా నాన్న చనిపోయిన రోజు. దాని వల్ల ధనుష్ లో నేను నా తండ్రిని చూసుకున్నట్లు ఫీల్ అవుతాను. ఆయన మీద అంత ప్రేమ ఉంది' అని అన్నారు.


----------

# ఎన్టీఆర్, నీల్ మూవీ షూటింగ్ రద్దు ర్యూమర్స్



వదంతులను తోసిపుచ్చిన చిత్ర బృదం ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. ఈ సినిమా షూటింగ్ రద్దు అయిందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఎన్టీఆర్ లుక్ విషయంలో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో షూటింగ్ వాయిదా వేశారని టాక్ వినిపించింది. తాజాగా ఈ వార్తలపై నిర్మాణ సంస్థ క్లారిటీ ఇచ్చింది. 'సినిమా లో హీరో లుక్, దీని షెడ్యూల్ రద్దు అంటూ వస్తోన్న వార్తల్లో నిజం లేదు. ఈ సినిమా షూటింగ్ ప్లాన్ ప్రకారమే ముం దుకుసాగుతోంది. ప్రస్తుతం ప్రిపరేషన్ గ్యాప్ తీసుకు న్నారంతే. దయచేసి ఎవ రూ ఈ ప్రాజెక్ట్‌పై రూమర్స్ సృష్టించొద్దు. అనధికారిక సమాచారాన్ని షేర్ చేయొద్దు. ఏమైనా మార్పులు ఉంటే మేమే తెలియజేస్తాం' అని పేర్కొన్నారు. 'దేవర' తర్వాత ఎన్టీఆర్... 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తోన్న చిత్రమిది. 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉంది. ఎన్టీఆర్ సరసన ఇందులో రుక్మిణీ వసంత్ నటి స్తు న్నారు. రవి బస్రూర్ సంగీతం అంది స్తున్నారు. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు.





# పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతున్న బైకర్

టాలీవుడ్ హీరో శర్వానంద్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'బైకర్' బాక్సాఫీస్ వద్ద అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా, విడుదలైన ఐదు రోజుల్లోనే ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచే స్థాయిలో వసూళ్లు రాబడుతోంది. సాధారణంగా ఏ సినిమా అయినా వీక్‌డేస్‌లో కలెక్షన్లు తగ్గుముఖం పడతాయి. కానీ 'బైకర్' విషయంలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. రోజు రోజుకూ ఈ సినిమా పుంజుకుంటూ ముందుకు దూసుకెళ్తోంది. ముఖ్యంగా ప్రేక్షకుల నుంచి వస్తున్న పాజిటివ్ మౌత్ టాక్ ఈ చిత్రానికి పెద్ద ప్లస్‌గా మారింది.ఆన్‌లైన్ బుకింగ్స్ కూడా ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. సోమవారం రోజు బుక్‌మైషోలో సుమారు 15.6 వేల టిక్కెట్లు అమ్ముడవ్వగా, మంగళవారం ఈ సంఖ్య 17.2 వేలకు పెరగడం విశేషం. భారీ పోటీ ఉన్నప్పటికీ, ప్రేక్షకులు ఈ హై-ఓల్టేజ్ యాక్షన్ స్పోర్ట్స్ డ్రామాపై చూపిస్తున్న ఆసక్తి సినిమా విజయానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ చిత్రాన్ని దర్శకుడు అభిలాష్ రెడ్డి కంకర తెరకెక్కించగా, ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మించింది. సినిమాలో మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటించగా, సీనియర్ నటుడు డాక్టర్ రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించారు. అలాగే అతుల్ కుల్కర్ణి కూడా తన నటనతో ఆకట్టుకున్నారు. ఇక సంగీత దర్శకుడు జిబ్రాన్ అందించిన నేపథ్య సంగీతం ఈ సినిమాకు మరింత బలం చేకూర్చింది.

# అల్లు అర్జున్ మూవీ పేరు రాకా !




టైటిల్ రిలీజ్ చేసిన చిత్ర బృందం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరి పోయే గిఫ్ట్ అందింది. తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ చేయబో తున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటిం చారు. ఈ చిత్రా నికి 'రాకా' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. విడుదలైన పోస్టర్‌లో అల్లు అర్జున్ మునుపెన్నడూ చూడని విభిన్నమైన అవతారంలో కనిపిస్తున్నారు. గుండుతో, కళ్లకు కాటుక పెట్టుకుని, ఒంటిపై వింత ఆకృతులతో ఉన్న ఈ లుక్ చూస్తుంటే ఆయన ఏదో 'వేర్-బీస్ట్' (జంతువుగా మారే మనిషి) తరహా పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. 'జవాన్' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం. ఆమె ఈ చిత్రంలో ఒక వీరనారి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం సుమారు 800 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో, అత్యాధునిక ÷ఎఈచీ హంగులతో రూపొందుతోంది. హాలీవుడ్ టెక్నీషియన్లు కూడా ఈ ప్రాజెక్ట్ కోసం పని చేస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళం సహా 7 భాషల్లో 2027 వేసవిలో విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. 'విజన్ బియాండ్ లిమిట్స్' హద్దులు లేని ఊహ అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com